క్లుప్తంగా

విద్యార్థికి అభినందన



అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

నస్పూర్: దండేపల్లిలో ఈనెల 11 నుంచి జరిగే వాలీబాల్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన నస్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి అభిరామ్‌ని ఎంఈవో దామోదర్ అభినందించారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు బన్న రవీందర్, పత్తి సత్తయ్య, పీడీ కొండగొర్ల విఠల్, విద్యాకమిటీ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఫాంలో నేతాని తప్పు సవరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతకాని సంఘం నాయకులు

కాసిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ఫాంలో నేతకాని కులానికి బదులు నేతాని అని తప్పుగా ముద్రించిన అంశాన్ని వెంటనే సవరించాలని తెలంగాణ నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాంటెంకి వాసుదేవ్, దుర్గం సాగర్, బోర్లకుంట రాజేష్, సంకూరి సురేష్, కుమ్మరి సంతోష్ తదితరులు ఉన్నారు.

నిర్వాసిత నిరుద్యోగులకు పని కల్పించాలి

కాసిపేట: కేకే ఓసీపీ నిర్వాసిత నిరుద్యోగులకు పనికల్పించాలని ఓసీ బాధిత సమీప గ్రామాల నిర్వాసితులు కోరారు. శుక్రవారం మండలంలోని దుబ్బగూడెం ఆలయంలో ఓసీ ముంపు గ్రామం దుబ్బగూడెం, సమీప గ్రామాలు ట్యాంక్‌బస్తీ, లంబాడితండా, సోమగూడెం, మందమర్రి, బెల్లంపల్లికి ఓసీలోని వాల్వో ఆపరేటర్స్, డ్రైవర్స్, బ్లాస్టింగ్ హెల్పర్స్, ఇతర విభాగాల కార్మికులు సమావేశం అయ్యారు. ఆర్‌వీఆర్ కంపెనీ కాంట్రాక్టు గడువు పొడగించడంతో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కొందరు స్థానికేతరులు లేనిపోని డిమాండ్లతో ఇబ్బందులకు గురి చేయాలని చూస్తూ యాజమాన్యాన్ని, సదరు కంట్రాక్టు సంస్థను దూషిస్తూ బంద్ చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వారి మాటలు నమ్మకుండా తమను పనుల్లోకి తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో నిర్వాసిత కార్మికులు ఎండీ.రఫీ, డి.శ్రీనివాస్, హరిచందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో, జాతీయ ఆరోగ్య మిషన్‌లో క్వాలిటీ అష్యూరెన్సు మేనేజర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి 12వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, ఐడీవోసీ నస్పూర్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, గణపతి, దత్తాత్రేయహోమాలు, గురుపారాయణం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు గురుస్వామి పురుషోత్తమాచార్యులు, వేదపండితులు సంతోష్‌శర్మ, ఆలయ పూజారి హేమరాజ్‌త్రిపాఠి పాల్గొన్నారు.

రంగోళి పోటీలు

కోటపల్లి: స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలు తప్పక ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కోటపల్లి మండల సమాఖ్యలో శుక్రవారం ఏపీఎం వెంకటేశ్వర్లు రంగోళి పోటీలు నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యత, ఓటు ఎలా వేయాలో ఏపీఎం వెంకటేశ్వర్లు మహిళా సమాఖ్య సంఘాల సభ్యులకు వివరించారు. సంపత్, సీసీలు, సీఏలు పాల్గొన్నారు.

చెన్నూర్: మండల సమాఖ్య కార్యాలయం ఆవరణలో గ్రామీణాభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు స్వయం సహాయ సంఘాల పదాధికారులు, వీవోఏలకు శుక్రవారం స్వీప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మోహన్ హాజరై అవగాహన కల్పించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి, ఉత్తమ ముగ్గులకు బహుమతులు అందజేశారు. వెలుగు ఏపీఎం ప్రమీల, సిబ్బంది రవికుమార్, రాజమల్లు, శంకర్, ఆశోక్, స్వర్ణలత పాల్గొన్నారు.

చివరి మజిలీకి ఇక్కట్లు

- అసంపూర్తిగా వైకుంఠధామాలు
- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాని వైనం
- అంత్యక్రియలకు ఇబ్బందులు



సీసీసీలో అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం

నస్పూర్: చివరి మజిలీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణ పరిధిలో వైకుంఠధామాల పనులు అసంపూర్తిగా మారాయి. దీంతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణ పరిధిలోని సీసీసీ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, తాళ్లపల్లి గోదావరి నది ఒడ్డున ఒక్కొక్కటి చొప్పున రెండు వైకుంఠధామాల నిర్మాణాలకు అధికారులు టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.ఒక్కొక్కటికి రూ.కోటి చొప్పున కేటాయించారు. సుమారు రెండేళ్ల క్రితం వైకుంఠాధామాల పనులు ప్రారంభించినా అవి నేటికి పూర్తి కాలేదు. దీంతో అంత్యక్రియలకు ఇక్కట్లు తప్పడం లేదు.

మౌలిక వసతులు కరువు

సీసీసీలోని సింగరేణి స్థలంలో వైకుంఠధామం ఏర్పాటుకు నిర్ణయించి పనులు చేపట్టారు. మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో అసంపూర్తిగా మారింది. విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే దహన సంస్కార సమయంలో నిర్వహించాల్సి వస్తోంది. నీటి సౌకర్యం లేకపోవడంతో సమీపంలోని సింగరేణికి చెందిన జీఎల్ఎస్ఆర్ వద్ద ఆరుబయట పంప్‌ల కింద స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దుస్తులు మార్చుకోవడానికి గదులు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

అంత్యక్రియల నిర్ధారణలో ఇబ్బందులు

వ్యక్తి ప్రమాదంలో, ఆత్మహత్య, అనుమానాస్పదంగా మృతి చెందితే డెత్ సర్టిఫికెట్ కావాలి. ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం రిపోర్ట్ తదితర సర్టిఫికేట్లతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని వైకుంఠధామం లేదా ఆ వ్యక్తికి ఎక్కడ అంత్యక్రియలు పూర్తి చేశారో అధికారుల నుంచి అంత్యక్రియల నిర్ధారణ రసీదు (బూరియల్ గ్రౌండ్ రిసిప్ట్)ను తప్పనిసరిగా సమర్పించాలని అధికారులు పేర్కొంటున్నారు. వైకుంఠధామం అసంపూర్తిగా ఉండడంతో అంత్యక్రియల నిర్ధారణ రసీదుని అధికారులు ఇవ్వడం లేదు. దీంతో డెత్ సర్టిఫికేట్ పొందడంలో బాధిత కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి వైకుంఠధామాలు పూర్తి చేసి చివరి మజిలీ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి



వైకుంఠధామాల పనులు పూర్తి చేసి సౌకర్యాలు కల్పించాలి. వర్షాకాలంలో వైకుంఠధామంలోకి వెళ్లే దారి బురదను తొలగించాలి. స్నానపు గదులు నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– పెట్టం శ్రీనివాస్, న్యూనాగార్జున కాలనీ

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న భాస్కర్

మందమర్రిరూరల్: ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని సీపీఎం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సీపీఎం 3వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రజలు నిలదీయాలన్నారు. సీపీఎం చేపట్టే ప్రజాపోరాటాలకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోమాస ప్రకాశ్, నాయకులు పైళ్ల ఆశయ్య, సంకె రవి, కనికరపు ఆశోక్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సీఓఈ విద్యార్థి ఎంపిక

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల బీపీసీ సెకండియర్ విద్యార్థి కే.శ్రీహర్ష రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీహర్షను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఇటీవల జోనల్‌స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సీఓఈ వైస్‌ప్రిన్సిపాల్ ఏ.విజయ్‌సాగర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రాజశేఖర్, ఏ.వామన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాండూర్: తాండూర్ పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..రామగుండం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, తాండూర్ పోలీసులు సంయుక్తంగా ఐబీ ప్రాంతంలో ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బోయపల్లి బోర్డు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేమనపల్లి: మండల కేంద్రంలో సమీపంలో ప్రాణహిత నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. డ్రైవర్ దద్దెర కిష్టయ్య, యజమాని కంపెళ్ల సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే తనిఖీ



జన్నారం: పానకల్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ కిషన్

చెన్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైంది. మండలంలోని అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల్లో చేపట్టిన సర్వేను డీపీవో వెంకటేశ్వర్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. సర్వే ఎలా కొనసాగుతుందని పరిశీలించారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలి, పంచాయతీ కార్యదర్శి సిరాజొద్దీన్, ఉపాధ్యాయురాలు సునీత ఉన్నారు.

జన్నారం: సమగ్ర ఇంటింటి సర్వేలో ఉన్న అన్ని అంశాలకు సంబంధించిన అన్ని సమాచారాన్ని సేకరించాలని డీఆర్‌డీఏ కిషన్ అన్నారు. మండలకేంద్రంలోని పొనకల్‌లో శుక్రవారం ప్రారంభమైన సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లివారితో మాట్లాడి అడిగిన అన్ని వివరాలను సేకరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎంఈవో విజయ్‌కుమార్, ఆర్.భానుచందర్, కార్యదర్శి రాహుల్ తదితరులు ఉన్నారు.

చెన్నూర్: సమగ్ర ఇంటింటి సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ కోరారు. సర్వే నిర్వహణకు కేటాయించిన ఉపాధ్యాయులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బందికి ఫార్మెట్‌లో పొందుపర్చిన ఆధార్, కులం, మతం, ఇతరత్రా వివరాలను ఇంటింటికి వచ్చి సేకరిస్తారని పేర్కొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇంటింటా, సమగ్ర కులగణన సర్వేకు సంబంధించి శుక్రవారం హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో శిక్షణ సిబ్బందికి సర్వే సామగ్రిని పంపిణీ చేశారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో ఉమర్‌షరీఫ్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, మండల ప్రణాళికా గణాంకాధికారి హన్ మోహన్, ప్రజాప్రతినిధులు సామగ్రిని ఎన్యుమరేటర్లకు అందజేశారు. మండలంలోని పంచాయతీల్లో 65 మంది ఎన్యుమరేటర్లు సర్వే చేపడుతుండగా ఆరుగురు సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. రాపల్లిలో అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట రవి, నాయకులు శ్రీశైలంగౌడ్, కొట్టె మహేందర్, కోటె సత్తయ్య సర్వే తీరును పరిశీలించారు.



శివలింగాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

కాసిపేట: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం శిక్షణకు సంబంధించిన సామగ్రిని ఎన్యుమరేటర్లకు అందించినట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తెలిపారు. కోమటిచేను, తాటిగూడ, కోనూరు పంచాయతీల్లో సర్వే తీరును పరిశీలించారు. ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, ఏఎస్‌వో అమరేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దండేపల్లి: దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్వే సిబ్బందికి ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం సర్వేను ప్రారంభించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటపల్లి: సర్వేలో ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా చూడాలని ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలో శుక్రవారం సర్వేను ప్రారంభించి అధికారులకు సర్వే పత్రాలతోపాటు స్టిక్కర్లు అందజేశారు. మండలంలో 31 పంచాయతీల్లో 84 మంది ఎన్యూమరేటర్లు, 7 గురు సూపర్‌వైజర్లను నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ రాజు, సీఆర్పీ సంపత్, గణపతి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రామకృష్ణాపూర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్/తాండూర్/కాసిపేట/జన్నారం/శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట/భీమిని/ మందమర్రిరూరల్: సీఎం రేవంతర్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. రామకృష్ణాపూర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, మహంకాళి శ్రీనివాస్, గోపురాజం, సతీశ్, కనకరాజు పాల్గొన్నారు.

- జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తాలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆదేశాలతో నాయకులు కేక్ కట్ చేశారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రోగులకు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు.
- చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. చెన్న సూర్యనారాయణ, పాతర్ల నాగరాజు, ఈర్ల నారాయణ, మంత్రి లక్ష్మణ్, అన్వర్, కరీం గజ్జెల అంకగౌడ్ పాల్గొన్నారు.
- తాండూరులో మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, కేక్ కట్ చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, బన్న లక్ష్మణ్‌దాస్, తిరుపతి ఉన్నారు.
- జన్నారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, పీఏసీఎస్ చైర్మన్ రవి పాల్గొన్నారు.
- కోటపల్లి మండలం సర్వాయిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కాంగ్రెస్ నేత సమ్మయ్య నాయక్ అధ్వర్యంలో కేక్ కట్ చేశారు.
- శ్రీరాంపూర్‌లోని సాయి అంధుల, వృద్ధుల పాఠశాలలో ఐఎన్టీయూసీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, టీబీజీకేఎస్... ఓసీపీ నాయకులు శీలం చిన్నయ్య, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

- లక్సెట్టిపేట ఐబీ ఆవరణలో జరిగిన వేడుకల్లో నాయకులు ఎండీ ఆరీఫ్, పింగిళి రమేశ్, నాగభూషణం, రాజు, చిన్నన్న పాల్గొన్నారు.
- భీమిని, కన్నెపల్లిల్లో నర్సింగరావు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు ఉన్నారు.
- మందమర్రిలోని పాత బస్టాండ్ ఏరియాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్ హాజరై కేక్ కట్‌చేశారు. పాన్నారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

పెన్షన్ కేసులు త్వరగా పరిష్కరించాలి

- జీఎం సూర్యనారాయణ



అధికారులతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ కేసులను త్వరగా పరిష్కరించాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సీఎంపీఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశానికి జీఎంతోపాటు సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచోరి హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. గనుల వారీగా సంక్షేమ అధికారులు ఎప్పటికప్పుడు ఈ కేసుల పురోగతిని సమీక్షించాలన్నారు. సీఎంపీఫ్ పెండింగ్ కేసులు క్లియర్ చేయాలన్నారు. అనంతరం హరి పచోరి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ రికవరీ అయ్యేలా చూడాలన్నారు. వాటి వివరాలను త్వరితగతిన ప్రాసెస్ చేయాలన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, ఇన్‌చార్జి ఎస్‌ఓటూజీఎం శ్రీధర్‌రావు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ నాయకులు సమ్మయ్య, వీరభద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ పద్మ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



కాసిపేట: క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్‌కాస్టు కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీ బలరాంనాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గురు కృషి వల్లనే తమకు లాభాల వాటా రూ.5వేలు అందించారని తెలిపారు. సీఎం జన్మదినం సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు నసీరొద్దీన్, నారిశెట్టి ప్రణయ్, కొక్కుల రమేశ్, రాంరెడ్డి, రాజమొగిలి, సంతోష్, శ్రీధర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కాస్మెటిక్ చార్జీలు పెంపుపై హర్షం

వేమనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు పెంచడంపై మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నీల్వాయి కేజీబీవీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మాజీ సర్పంచులు గాలి మధు, తిరుపతిరెడ్డి, నాయకులు వెంకటేశం, పూర్ణచంద్రారెడ్డి, పురుషోత్తం, మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంచిర్యాల ఆర్డీవో గూడూరు శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఆర్డీఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దావర్ ప్రభులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులు, ధరణి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ భూముల వివరాలతోపాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రకియపై ఆరా తీశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

రికార్డులు పరిశీలన

లక్సెట్టిపేట: తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను శుక్రవారం ఆర్డీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ధరణి, ప్రజావాణి, ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఉన్నారు.

దిశ నామినేటెడ్ సభ్యుడిగా పోచం

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట పంచాయతీ సాయినగర్‌కు చెందిన రాంటెంకి పోచం జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ మానిటరీ కమిటీ దిశ నామినేట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. మంచిర్యాలలో జరిగిన సమావేశంలో కలెక్టర్ కుమార్ దీపక్ ఆయన్ను సన్మానించి అభినందించారు. తనపై నమ్మకంతో నియమించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు పోచం కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అర్పిత మారంరెడ్డి

నస్పూర్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి పేర్కొన్నారు. నస్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్పిత మారంరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా విద్యార్థులు న్యాయసాయం తీసుకోవాలంటే న్యాయసేవా సంస్థను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా టోల్ ఫ్రీ నంబర్ 15100కు డయల్ చేసి న్యాయ సహాయం, సలహాలు పొందవచ్చునని తెలిపారు. డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ ఎండీ సంధాని, ఎంఈవో దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు సన్మానం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎల్లందు డివిజన్‌కు బదిలీపై వెళ్తున్న గోవిందరావును శుక్రవారం స్థానిక ఆయా పార్టీల నాయకులు సన్మానించారు. ఉద్యోగులందరితో సఖ్యతగా ఉంటూ అనతికాలంలోనే మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి చిత్రపటంతో తనయుడి గృహప్రవేశం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఇంద్రానగర్‌లో నూతన గృహప్రవేశం వినూత్నంగా జరిగింది. మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేసిన ఆయిళ్ల మెండి రెండేళ్ల క్రితం మృతిచెందాడు. అతడి స్థానంలో కుమారుడు అశోక్ కుమార్ కార్మికుడిగా ఉద్యోగంలో చేరాడు. ఇటీవల కొత్త ఇంటిని నిర్మించగా శుక్రవారం గృహ ప్రవేశం చేశాడు. అందరిలాగా దేవతల ఛాయా చిత్రాలతో కాకుండా తండ్రి మెండి చిత్రపటం చేతపట్టుకుని తల్లి సత్తమ్మతో కలిసి ఇంట్లో గృహప్రవేశం చేశారు. ఆ తీరు అందరి దృష్టిని ఆకర్శించి చర్చనీయాంశమైంది.

గూడెంలో అమరవీరుల సంస్మరణసభ

దండేపల్లి: భూమికోసం, భుక్తి కోసం, దేశవిముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ దండేపల్లి మండలం గూడెం ఒడ్డెర కాలనీలో ఏఐకేఎంఎస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం సంస్మరణసభ నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేస్తాం

మందమర్రిరూరల్: ఇటీవల గుండెపోటుతో కేకే-5గనిలో కార్మికుడు మోకనపల్లి లక్ష్మణ్ మృతి చెందగా గని ప్రమాదంగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు, పలు యూనియన్ల ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. విధులకు ఆటంకం కలిగించారనే సాకుతో యాజమాన్యం ఆరుగురికి చార్జిమెమో ఇచ్చింది. ఆరుగురు కార్మికులు శుక్రవారం గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులను నిలదీస్తూ చార్జిషీట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఏఐటీయూసీ నాయకులు అధికారులతో మాట్లాడి చార్జిమెమో రద్దు చేయించి న్యాయం చేస్తామని ఇచ్చిన హామీతో ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు.